


అధికార పార్టీ నాయకుల బుసక దందాకు అంతులేకుండా పోతోంది. మచిలీపట్నం ఎమ్మెల్యే ముఖ్య అనుచరుడిగా ఉన్న ఒక ద్వితీయశ్రేణి నాయకుడు ఈ అక్రమానికి తెగబడుతున్నాడు. ఎన్నికల తరువాత మళ్లీ అవకాశం దక్కుతుందో లేదోనని హడావుడిగా బుసక వ్యాపారం చేస్తూ ప్రైవేటు ఖాళీ స్థలాలను మెరక చేసే పనులు ప్రారంభించాడు. బందరుపోర్టు పనుల్లో భాగంగా తవ్వుతున్న మట్టిని టిప్పర్ల ద్వారా తరలించి ప్రైవేటు స్థలాల మెరకకు అమ్ముకుంటున్నాడు. విషయం తెలుసుకుని అడ్డుకున్న రెవెన్యూ అధికారిపై చిందులు తొక్కాడు. నేనేంటో చూపిస్తా అంటూ బెదిరింపులకు పాల్పడ్డాడు.

వైసీపీ అభ్యర్థులపై ఆ పార్టీ నేతల్లో అయోమయం నెలకొంది. ప్రకటించిన వారిలో కొందరికి చివరి వరకు తమనే అభ్యర్థిగా ఉంచుతారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మరికొందరు అసలు నియోజకవర్గంవైపే కన్నెత్తి చూడటం లేదు. ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో వైసీపీలో నెలకొన్న పరిస్థితికి నిదర్శనమిది. ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థులు ఎవరన్న అంశంపై ఆ పార్టీ శ్రేణుల్లో తీవ్ర గందరగోళం నెలకొంది. ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో మొత్తం 14 స్థానాలకుగాను టీడీపీ - జనసేన కూటమి 10 స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించింది. మరో రెండు స్థానాలను జనసేనకు కేటాయించనుంది. మిగిలిన రెండు స్థానాలపై స్పష్టత రావాల్సి ఉంది. వైసీపీలో మాత్రం విడతల వారీగా ఇన్‌చార్జుల జాబితాలను విడుదల చేస్తున్నా ఇంత వరకు ప్రకటించిన స్థానాలు 8 మాత్రమే. వాటిలో కూడా చివరి వరకు ఎవరు ఉంటారు? ఎవరిని తొలగిస్తారు? అని ఆ పార్టీ శ్రేణుల్లో సందిగ్ధత నెలకొంది. - (విజయవాడ - ఆంధ్రజ్యోతి)



వచ్చేదెవరో.. పోయేదెవరో..!?

వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జుల్లో అయోమయం

- కాపు నేతలపై వైసీపీ కన్ను
- వంగవీటి రాధాతో కొడాలి నాని, పేర్ని నాని భేటీ
- విజయవాడ పశ్చిమ ఇస్తామని ఆఫర్
- సున్నితంగా తిరస్కరించిన రాధా
- మైలవరం తెరపైకి లకిరెడ్డి కుటుంబసభ్యుల పేరు
- పెడన సీటు బూరగడ్డ వేదవ్యాస్‌కు..
- అవనిగడ్డ సీటు బుద్ధప్రసాద్‌కు ఆఫర్
- మంతనాలు చేస్తున్న పేర్ని నాని, బాడిగ రామకృష్ణ

పశ్చిమానికి 'షేక్'!

ఎన్టీఆర్ జిల్లాలో విజయవాడ పశ్చిమానికి షేక్ ఆసిఫ్‌ను ప్రకటించారు. ఇప్పటికే ఆయన నియోజకవర్గంలో ప్రచారం కూడా ప్రారంభించారు. అయితే చివరి నిమిషంలో ఆసిఫ్ స్థానంలో మరొకరు బరిలో నిలిచే అవకాశం ఉందన్న ప్రచారం జోరుగా సాగుతోంది. టీడీపీ నేత జలీల్‌ఖాన్ కొద్ది రోజుల క్రితం అయోధ్యరామిరెడ్డిని కలిసి పశ్చిమ సీటు ఇస్తే వైసీపీలో చేరేందుకు సుముఖత చూపారన్న ప్రచారం జోరుగా సాగింది. తాజాగా మంగళవారం కొడాలి నాని, పేర్ని నాని.. వంగవీటి రాధాను కలిసి పశ్చిమ సీటు ఆఫర్ చేశారు. రాధా వారి ఆఫర్‌ను సున్నితంగా తిరస్కరించినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో ఆసిఫ్ చివరి వరకు బరిలో ఉంటారా లేదా అన్నది అనుమానమే.

అవనిగడ్డకు మూడో పేరు

అవనిగడ్డలో ముచ్చటగా మూడో కృష్ణుడి పేరు తెరపైకి వచ్చింది. ఈ స్థానం నుంచి సిటింగ్ ఎమ్మెల్యే సింహాద్రి రమేశ్‌ను పక్కనపెట్టి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్‌ను ఇన్‌చార్జిగా నియమించారు. ఆయన పోటీకి విముఖత చూపడంతో ఆయన తనయుడు రాంచరణ్‌ను తెరపైకి తెచ్చారు. తాజాగా టీడీపీ నేత మండలి బుద్ధప్రసాద్‌తో వైసీపీ నాయకులు మంతనాలు చేస్తున్నారు.

ప్రకటించిన స్థానాలపై అనుమానం

- మైలవరానికి సర్నాల తిరుపతిరావును ప్రకటించారు. ఈయన చివరి వరకు బరిలో ఉండటం అనుమానమేనని సొంత పార్టీ శ్రేణులే అనుమానం వ్యక్తం చేస్తున్నాయి. ఇక్కడి నుంచి జోగి రమేశ్, వల్లభనేని వంశీ పేర్లతోపాటు లకిరెడ్డి బాలరెడ్డి సోదరుడు హనిమిరెడ్డి కుటుంబం నుంచి ఒకరు పోటీ చేస్తారన్న ప్రచారం కూడా జరుగుతోంది.
- పెడన నుంచి ఉప్పాల రాము పేరు ప్రకటించగా ఆయన టికెట్ కూడా అనుమానమేనంటున్నారు. ఈ స్థానం నుంచి టీడీపీ టికెట్ ఆశించి భంగపడ్డ బూరగడ్డ వేదవ్యాస్‌ను వైసీపీలోకి ఆహ్వానించి ఆయనకు పెడన టికెట్ ఇస్తారన్న ప్రచారం జరుగుతోంది. ఇప్పటి వరకు ప్రకటించిన స్థానాల్లో విజయవాడ సెంట్రల్ నుంచి వెలంపల్లి శ్రీనివాసరావు, తిరువూరు నుంచి నల్లగట్ల స్వామి దాసు, మచిలీపట్నం నుంచి పేర్ని కృష్ణమూర్తి అలియాస్ కిట్టు, పెనమలూరు నుంచి జోగి రమేశ్ మాత్రమే చివరి వరకు బరిలో నిలిచే అభ్యర్థులుగా ఉన్నారు.

ప్రకటించాల్సిన స్థానాల్లో గందరగోళం

ఎన్టీఆర్ జిల్లాలో విజయవాడ తూర్పు నుంచి దేవినేని అవినాశ్, నందిగామ నుంచి మొండితోక జగన్మోహనరావు, జగ్గయ్యపేట నుంచి సామినేని ఉదయభాను పేర్లను ప్రకటించాల్సి ఉంది. కృష్ణా జిల్లాలో గుడివాడ నుంచి కొడాలి నాని, గన్నవరం నుంచి వల్లభనేని వంశీ, పామర్రు నుంచి కైలే అనీల్ కుమార్ పేర్లను ప్రకటించాల్సి ఉంది. వీరిలో కొడాలి నాని, వల్లభనేని వంశీ, సామినేని ఉదయ భానుకు టికెట్లు ఉండవన్న ప్రచారం జరుగుతోంది. జగ్గయ్యపేట నుంచి బొల్లా శివరామకృష్ణ, కేశినేని శ్వేత పేర్లు వినిపిస్తున్నాయి. గన్నవరం నుంచి ముద్దరబోయిన వెంకటేశ్వరరావుకు దాదాపు ఖాయమని ప్రచారం జరుగుతోంది. గుడివాడ నుంచి కాపు లేదా ఎస్సీ సామాజికవర్గం వారికి అవకాశం ఇస్తారని ప్రచారం జరుగుతోంది.

పేర్నినాని, బాడిగ రామకృష్ణ మధ్యవర్తిత్వం

టీడీపీలో అసంతృప్తితో ఉన్న నేతలతో పేర్ని నాని, బాడిగ రామకృష్ణ మంతనాలు చేస్తున్నట్టు సమాచారం. మచిలీపట్నం ఎంపీ స్థానం నుంచి బాడిగ రామకృష్ణ కానీ ఆయన కుటుంబ సభ్యుల్లో ఒకరు వైసీపీ అభ్యర్థిగా బరిలో ఉంటారన్న ప్రచారం జరుగుతోంది. సింహాద్రి రమేశ్‌కు ఎక్కడా టికెట్ ఇవ్వకపోవచ్చని పార్టీ శ్రేణులు చెబుతున్న మాట. ఇటీవల బూరగడ్డ వేదవ్యాస్‌ను రామకృష్ణ కలిసి వచ్చారు. పేర్ని నాని.. మండలి బుద్ధ ప్రసాద్, వంగవీటి రాధాతో మాట్లాడి వారిని వైసీపీలోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. అందులో భాగంగా వారికి సీట్లు కూడా ముందుగానే ఆఫర్ చేస్తున్నట్టు సమాచారం.

వైసీపీ సమర్పించు బుసకాసురుడు!

బందరులో అధికార పార్టీ నాయకుడి బుసక దందా

- కరగ్రహారం ఇళ్ల స్థలాల మెరక పేరుతో అనుమతులు
- ప్రైవేటు స్థలాలకు అమ్మి రూ.కోట్లలో ఆర్జన
- అక్రమాన్ని అడ్డుకున్న రెవెన్యూ సిబ్బందికి బెదిరింపులు

అడ్డుకుంటే నేనేంటో చూపిస్తానని తీవ్ర హెచ్చరిక



ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : మచిలీపట్నం శివారునున్న కరగ్రహారం జగనన్న లే అవుట్‌లోని 350 ఎకరాలను మెరకచేసే పనులు స్థానిక ఎమ్మెల్యే అనుచరుడికి అప్పగించారు. ఆయన మచిలీపట్నం పరిసర ప్రాంతాల్లోని ప్రైవేటు స్థలాలను మెరక చేసే పనులకు కాంట్రాక్టుకు తీసుకున్నాడు. బందరుపోర్టు వద్ద తవ్వే బుసకను కరగ్రహారం జగనన్న లే అవుట్‌కు తరలించకుండా తాను కాంట్రాక్టుకు తీసుకున్న ప్రైవేటు స్థలాలకు తరలించి విక్రయిస్తున్నాడు. ఇప్పటికే జలాల్‌పేటలోని రెండెకరాల ప్రైవేటు స్థలంలోకి మట్టిని తరలించి మెరక చేశాడు. ఈ వ్యాపారం బాగుండటంతో మచిలీపట్నం-ఒంగోలు జాతీయ రహదారి 216-ఏ పక్కనే ఎస్ఎన్ గొల్లపాలెం సమీపంలోని పంట భూముల్లోకి పోర్టు వద్ద తవ్విన బుసకను టిప్పర్ల ద్వారా తరలించే పనిని బుధవారం ప్రారంభించాడు. పోర్టు పనులు జరుగుతున్న ప్రాంతంలో 10 టిప్పర్లలో బుసకను నింపితే నాలుగు టిప్పర్లను కరగ్రహారం లే అవుట్‌కు, అందులో ఆరింటిని ప్రైవేటు స్థలాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు. ఒక్కో టిప్పర్ బుసకను రూ.7,500కు అమ్మి సొమ్ము చేసుకుంటున్నాడు.

రెవెన్యూ అధికారికి బెదిరింపులు..

బందరుపోర్టు పనుల్లో భాగంగా తవ్విన బుసకను కరగ్రహారం లే అవుట్ వద్దకు కాకుండా ఎస్ఎన్ గొల్లపాలెం వద్ద జాతీయ రహదారి పక్కనే ఉన్న పంట భూముల్లోకి తరలిస్తున్న విషయాన్ని గమనించిన స్థానికులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. రెవెన్యూ సిబ్బంది బుసక తరలింపు అనుమతులు చూపాలన్నారు. అనుమతులు చూపకపోవడంతో టిప్పర్లను తహసీల్దార్ కార్యాలయానికి తరలించాలని ఆదేశించారు. అక్కడున్న అధికార పార్టీ నాయకుడికి ఈ సమాచారం అందింది. 'ఈ భూమిని మెరకచేసే పనులను నేనే కాంట్రాక్టుకు తీసుకున్నాను. టిప్పర్లను ఆపవద్దు. బుసక రవాణాను అడ్డుకుంటే నేనేంటో చూపిస్తా' అని ఆ అధికారిని బెదిరించాడు. పంట భూములను మెరక చేసేందుకు ఎలాంటి అనుమతులూ తీసుకోకుండా, సీనరేజి కట్టకుండా బుసకను ఎలా తరలిస్తారని రెవెన్యూ సిబ్బంది ప్రశ్నించారు. వైసీపీ నాయకుడు రెచ్చిపోయాడు. 'బుసక తరలింపును ఆపేది లేదు. ఎవరు అడ్డుకుంటారో చూస్తా' అని ఫోన్‌లోనే రెవెన్యూ సిబ్బందిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డాడు. టిప్పర్లలో ఉన్న బుసకను జాతీయ రహదారిపై దింపేసి వాహనాలను తీసుకువచ్చేయాలని తన అనుచరులకు సూచించి వాహనాలను తీసుకుపోయాడు.

జగనన్న లే అవుట్ల పేరుతో దందా..

మచిలీపట్నంలో జగనన్న లే అవుట్‌ల మెరక పనుల్లో అధికశాతం ఎమ్మెల్యే అనుచరుడిగా ఉన్న ద్వితీయశ్రేణి నాయకుడికే కట్టబెట్టారు. గిలకలదిండిలో 20 ఎకరాల్లో జగనన్న లే అవుట్ మెరక పనులు ఇతనే చేశాడు. ప్రభుత్వ భూముల్లో ఉన్న బుసకను తరలించేసి రూ.3కోట్లకుపైగా బిల్లులు చేసుకున్నట్టు ఆపార్టీ నాయకులే చెబుతున్నారు. గిలకలదిండిలోని లే అవుట్‌ను పూర్తిస్థాయిలో మెరకచేయకుండా రూ.3కోట్లు బిల్లులు చేసుకున్నారని స్థానికులు అంటున్నారు. సక్రమంగా మెరక పనులు చేయని నేపథ్యంలో స్థానిక పెద్దలు ప్రశ్నిస్తే వారికి కొంతనగదు ముట్టచెప్పి ఈ విషయంపై మాట్లాడకుండా చేశాడు. కరగ్రహారం లే అవుట్ పనులను ఈ ద్వితీయశ్రేణి నాయకుడికే అప్పగించడంతో దీనిని సాకుగా చూపి బయటి ప్రాంతాలకు బుసకను విక్రయిస్తూ లక్షలాది రూపాయలు కాజేస్తున్నాడు. బందరుపోర్టు వద్ద తవ్విన బుసకను కృష్ణా యూనివర్సిటీ ఆవరణకు తరలించి మెరక చేస్తామని చెప్పినా ఇంతవరకు ఒక్క టిప్పరు మట్టిని కూడా తరలించలేదు. బయటి ప్రాంతాలకు మాత్రం యథేచ్ఛగా బుసకను విక్రయించేస్తుడటం గమనార్హం.



మంత్రి అనుచరులు పంపిణీ చేసిన చీర, కుక్కర్

మాకు ఓట్లు... మీకు తాయిలాలు

కానూరులో డ్వాక్రా గ్రూపుల యానిమేటర్లకు మంత్రి జోగి రమేష్ అనుచరుల చీరలు, కుక్కర్ల పంపిణీ

పెనమలూరు, ఫిబ్రవరి 28 : పెనమలూరు వైసీపీ ఇన్‌చార్జి, మంత్రి జోగి రమేష్ తాయిలాల పంపిణీ కొనసాగుతోంది. పది రోజుల క్రితం పెనమలూరులో పాస్టర్లకు కుక్కర్లు, డబ్బులు పంపిణీ చేశారు. వారం కిందట కానూరు మన కల్యాణ మండపంలో వలంటీర్లకు విలువైన ఫ్లాస్కులు, హాట్‌బాక్సులు ఇచ్చారు. బుధవారం అదే కల్యాణ మండపంలో కంకిపాడు, ఉయ్యూరు, పెనమలూరు మండలాలకు చెందిన 190 మంది డ్వాక్రా గ్రూపుల యానిమేటర్లకు విలువైన చీరలు, కుక్కర్లను మంత్రి అనుచరులు అందజేశారు.

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమంలో కోత



1214 మెమోతో బిల్డింగ్ వర్కర్స్ సంక్షేమ పథకాల నిలిపివేత

కార్మికుల్లో సింహభాగంగా ఉన్న భవన నిర్మాణ రంగ వర్కర్ల పరిస్థితి దారుణంగా ఉంది. వారి సంక్షేమాన్ని ప్రభుత్వం గాలి కొదిలేసింది. మెమో నెంబర్ 1214 ద్వారా భవన నిర్మాణ కార్మికులకు అమలౌతున్న సంక్షేమ పథకాలన్నింటినీ నిలిపివేయటం పట్ల కార్మికుల నుంచి ఆందోళన వ్యక్తమౌతోంది. ఈ క్రమంలో బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ నేతృత్వంలో రెండు రోజుల రిలే నిరాహార దీక్షలు బుధవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రారంభమయ్యాయి.

- వెల్ఫేర్ బోర్డు ద్వారా పాత విధానం అమలు చేయాలని వేడుకోలు
- రెండు రోజుల నిరాహార దీక్షల్లో భవన నిర్మాణ కార్మికులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి సంబంధించి వెల్ఫేర్ ఫండ్ ఉన్నా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేయకుండా వాటిని కుదించేసింది. ఫలితంగా భవన నిర్మాణ రంగ కార్మికులు ఆందోళన చెందుతున్నారు. పొరుగున ఉన్న తెలంగాణా రాష్ట్రంలో భవన నిర్మాణ రంగ కార్మికుడు మరణిస్తే రూ.6 లక్షలు నష్టపరిహారం చెల్లిస్తున్నారు. సహజ మరణానికి రూ.2 లక్షలు ఇస్తున్నారు. ఇవి కాకుండా వివాహ కానుక, ప్రసవ కానుక, వృత్తిపరమైన పనిముట్లు తదితర సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారు. ఇలాంటి పథకాలనే పొరుగున ఉన్న తమిళనాడు, కర్నాటకలలో కూడా అమలు చేస్తున్నారు. మన దగ్గర మాత్రం అలాంటి పరిస్థితి లేదు.

1214 మెమో రద్దు కోరుతూ వినతులు

ఉమ్మడి కృష్ణా జిల్లాలో లక్ష మంది వరకు భవన నిర్మాణ రంగ కార్మికులు ఉన్నారు. నవరత్నాల పేరుతో గతంలో ఉన్న పథకాలను కూడా నిలుపుదల చేశారు. నవరత్న పథకాల్లో భాగంగా వైఎస్ఆర్ బీమా పరిహారం రావాలంటే కుటుంబ పెద్ద చనిపోవాలి. కానీ కార్మికుల సంక్షేమ బోర్డు ద్వారా పరిహారం రావాలంటే.. కుటుంబ పెద్ద కాకపోయినా ప్రమాదంలో ఎవరు చనిపోతే పరిహారం వచ్చేది. నవరత్న పథకంలో భాగంగా వైఎస్ఆర్ బీమా పేరుతో ఉన్న పథకాన్ని తీసేయటం వల్ల ఎంతో మంది మరణించిన భవన నిర్మాణరంగ కార్మికులకు అన్యాయం జరిగింది. నవరత్నాల్లో మరో పథకమైన వైఎస్ఆర్ వివాహ కానుక కారణంగా.. భవన నిర్మాణ కార్మికులకు అమలు చేస్తున్న వివాహ కానుకను రద్దు చేశారు. వైఎస్ఆర్ వివాహ కానుక కింద కచ్చితంగా అమ్మాయి పదో తరగతి చదివి ఉండాలి. అదే భవన నిర్మాణ బోర్డులో అయితే అలాంటి నిబంధన ఏమీ లేదు. పదో తరగతి వరకు చదివించగలిగే స్తోమత లేని వారి పరిస్థితి ఏమిటని కార్మికులు వాపోతున్నారు. నవరత్నాల్లో సహజ మరణానికి ఎలాంటి నష్టపరిహారం లేదు. ప్రమాదంలో గాయపడి హాస్పిటల్ పాలైనా కూడా వెల్ఫేర్ బోర్డు ద్వారా ఎలాంటి జీవన భృతి రావటం లేదు. భవన నిర్మాణ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ద్వారా అమలైన సంక్షేమ పథకాలు.. నవరత్నాల్లో భాగంగా అమలు చేస్తున్న వాటిలో లేవు. దీంతో పాత విధానాన్నే భవన నిర్మాణ రంగ కార్మికులు కోరుతున్నారు. ప్రభుత్వం జారీ చేసిన 1214 మెమోను రద్దు చేయాల్సిందిగా ఎన్నాళ్ల నుంచో వినతిపత్రాలు ఇస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. దీంతో బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ నేతృత్వంలో రెండు రోజుల రిలే నిరాహార దీక్షలు చేపట్టారు.

ఇంటర్ పరీక్షలు, సీఎం పర్యటన.. ఒకేరోజు

- బస్సులన్నీ సీఎం సభకు
- విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకునేదెలా?

ఆంధ్రజ్యోతి- మచిలీపట్నం : ఇంటర్మీడియట్ పరీక్షల ప్రారంభం రోజునే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కృష్ణాజిల్లాలో పర్యటించనున్నారు. దీంతో పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ఇక్కట్లు తప్పేలాలేవు. మార్చి 1వ తేదీన పామర్రులో ఉదయం 10 గంటల నుంచి జరిగే విద్యాదీవెన కార్యక్రమానికి సీఎం హాజరుకానున్నారు. జిల్లాలో 400లకుపైగా బస్సుల్ని సీఎం పర్యటనకు జన సమీకరణ కోసం అధికారులు సిద్ధం చేశారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్ష మార్చి 1వ తేదీ శుక్రవారం ఉదయం 9 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం 12 గంటలకు ముగుస్తుంది. పామర్రుకు ముఖ్యమంత్రి 10.50కు చేరుకుంటారు. మధ్యాహ్నం రెండు గంటల వరకు సీఎం పామర్రులోనే ఉంటారు. ఈ నేపథ్యంలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు పెడతారు. ఇంటర్మీడియట్ పరీక్షల ప్రారంభం మొదటిరోజున తల్లిదండ్రులు తమ పిల్లలతో సహా పరీక్షా కేంద్రాలకు వెళ్లి జాగ్రత్తలు చెబుతూ ఉంటారు. సీఎం పర్యటన సందర్భంగా విధుల్లో ఉన్న ఉద్యోగులు తమ పిల్లలను పరీక్షా కేంద్రాలకు తీసుకువెళ్లే అవకాశం లేకుండా పోతోందని వాపోతున్నారు.

చలో తాడేపల్లిగూడెం

- టీడీపీ - జనసేన ఉమ్మడి సభకు భారీగా తరలిన శ్రేణులు
- వందలాది కార్లతో బాలశౌరి ర్యాలీ
- విజయవాడ నుంచి పెద్ద సంఖ్యలో తరలిన అభిమానులు

(విజయవాడ - ఆంధ్రజ్యోతి) : టీడీపీ - జనసేన ఉమ్మడిగా నిర్వహిస్తున్న తొలి సభకు ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల నుంచి భారీఎత్తున టీడీపీ, జనసేన శ్రేణులు తరలివెళ్లాయి. మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గ టీడీపీ - జనసేన ఉమ్మడి అభ్యర్థిగా టికెట్ ఆశిస్తున్న బాలశౌరి వందలాది కార్లతో ర్యాలీగా తాడేపల్లిగూడెం సభకు తరలివెళ్లారు. హనుమాన్‌జంక్షన్ వద్ద ఆయనకు అభిమానులు గజమాలతో ఘనస్వాగతం పలికారు.

- విజయవాడ నగరంలోని మూడు నియోజకవర్గాల నుంచి ఆయా నియోజకవర్గ ఇన్‌చార్జుల ఆధ్వర్యంలో రెండు పార్టీల అభిమానులు భారీఎత్తున వెళ్లారు.
- విజయవాడ పశ్చిమ నియోజకవర్గం నుంచి 4 బస్సులు, 40 కార్లతో అభిమానులు తరలివెళ్లారు. పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి జనసేన నగర అధ్యక్షుడు పోతిన మహేశ్ ఆధ్వర్యంలో సితార సెంటర్ నుంచి తరలివెళ్లారు.



హనుమాన్‌జంక్షన్ వద్ద బాలశౌరికి గజమాలతో స్వాగతం

- విజయవాడ తూర్పు నియోజకవర్గం నుంచి 15 బస్సులు, 60 కార్లతో ర్యాలీగా వెళ్లారు. విజయవాడ సెంట్రల్ నుంచి కూడా బొండా ఉమ అనుచరులు పెద్ద ఎత్తున తాడేపల్లిగూడెం సభకు తరలివెళ్లారు.

బాలికపై ప్రధానోపాధ్యాయుడి అసభ్య ప్రవర్తన

- సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ
- విచారణకు డీఈవో ఆదేశం

- 6లో..

మండలి బుద్ధప్రసాద్ వైసీపీలో చేరడం లేదు

ఆ పార్టీ నుంచి ఆహ్వానం వాస్తవమే

- అవాస్తవ ప్రచారాలను ప్రజలు నమ్మొద్దు
- కుమారుడు మండలి వెంకట్రామ్ స్పష్టీకరణ



వేదికపై జనసేన పార్టీ నాయకులు





తెలుగుదేశం పార్టీ నాయకులు



దాహం తీర్చేందుకు చల్లని మజ్జిగ



ఒళ్ళంతా జెండాలతో..



అన్న..ఎన్టీఆర్

జెండా జోష్





ఫ్లడ్‌లైట్, ఫ్లెక్సీ స్తంభాలపై అభిమానులు

పశ్చిమ గోదావరి జిల్లా ప్రత్తిపాడులో బుధవారం జరిగిన టీడీపీ-జనసేన ఉమ్మడి సభకు జనం పోటెత్తారు.. చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్‌లు తమ ప్రసంగాలతో ఇరుపార్టీల కార్యకర్తల్లో జోష్ నింపారు. ఉభయగోదావరి జిల్లాలతో పాటు, కృష్ణా, గుంటూరు, విశాఖ జిల్లాల నుంచి కార్యకర్తలు, అభిమానులు సభకు హాజరయ్యారు.



వయసు పైబడినా తగ్గేదేలే..



ఊరేగింపుగా రెక్కలు విరిగిన ఫ్యాన్



తెలుగు మహిళల సందడి



తాడేపల్లిగూడెం నుంచి జనసేన ర్యాలీ





వేదిక ముందు యువత ఉత్సాహం



మద్దాలి ఉషాగాయత్రి



డాక్టర్ సేతురామ్



ఎం.సురేందర్

కూచిపూడిని వరించిన అకాడమీ అవార్డులు

కూచిపూడి, ఫిబ్రవరి 28: కూచిపూడి నాట్యానికి విశేషమైన సేవలందిస్తూ దేశ, విదేశాల్లో ప్రచారం చేస్తున్న ఇద్దరిని కేంద్రసంగీత నాటక అకాడమీ అవార్డు, మరొకరిని బిస్మిల్లాఖాన్ యువ పురస్కారం వరించాయని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం కూచిపూడి సిద్ధేంద్ర యోగి నాట్య కళాపీఠం ప్రధానాచార్యుడు డాక్టర్ వేదాంతం రాధేశ్యామ్ బుధవారం తెలిపారు. 2023వ సంవత్సరానికి సంగీత నాటక అకాడమీ అవార్డుకు డాక్టర్ భాగవతుల సేతురామ్, మద్దాలి ఉషాగాయత్రి, 2023 సంవత్సరానికి ఉస్తాద్ బిస్మిల్లాఖాన్ యువ పురస్కారానికి ఎం.సురేంద్రనాథ్ ఎంపికయ్యారని ఆయన పేర్కొన్నారు. ముగ్గురు కళాకారులను కూచిపూడి అగ్రహారం యువతతోపాటు పలువురు నాట్యాచార్యులు, డాక్టర్ వేదాంతం రాధేశ్యాం, డాక్టర్ వేదాంతం రామలింగశాస్త్రి, పసుమర్తి రత్తయ్యశర్మ, డాక్టర్ చింతా రవిబాలకృష్ణ, డాక్టర్ ఏలేశ్వరపు శ్రీనివాసులుతోపాటు పలువురు ప్రత్యేకంగా అభినందించారు.

బాలికపై ప్రధానోపాధ్యాయుడి అసభ్య ప్రవర్తన

- సస్పెండ్ చేస్తూ డీఈవో ఉత్తర్వులు..విచారణకు ఆదేశం

ఘంటసాల, ఫిబ్రవరి 28: పాపవినాశనం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న బాలికపై అసభ్యంగా ప్రవర్తించావంటూ ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.శ్రీనివాస్‌పై బుధవారం బాలిక తల్లిదండ్రులు, గ్రామస్థులు దాడికి యత్నించారు. మంగళవారం తన పట్ల ప్రధానోపాధ్యాయుడు అసభ్యంగా ప్రవర్తించాడని బాలిక ఇంటి వెళ్లి తల్లిదండ్రులకు చెప్పింది. ఉదయం పాఠశాలకు వచ్చిన ప్రధానోపాధ్యాయుడిని తల్లిదండ్రులు, గ్రామస్థులు నిలదీశారు. ఆయన బుకాయించటంతో దాడికి యత్నించారు. గ్రామ పెద్దలు సముదాయించి ఎంఈవో దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లారు. చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నేడు పాఠశాలలో విచారణ జరుపుతాం

బాలిక తల్లిదండ్రులు జరిగిన విషయాన్ని నా దృష్టికి తెచ్చారు. గురువారం ఉదయం పాఠశాల వెళ్లి విచారణ జరుపుతాం. డీఈవోకు నివేదిక అందజేస్తాం.

-ఎన్.శివశంకర్‌రావు, ఎంఈవో-1, ఘంటసాల

ప్రధానోపాధ్యాయుడి సస్పెన్షన్

మచిలీపట్నం టౌన్: పాపవినాశనం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం బి.శ్రీనివాస్ బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించారని ఆరోపణలు రావడంతో డీఈవో తాహెరా సుల్తానా సస్పెండ్ చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. విచారణ చేయాలని ఎంఈవో శివశంకర్‌ను డీఈవో ఆదేశించారు.

ఎన్టీఆర్ జిల్లాలో 1,781 పోలింగ్ స్టేషన్లు

వన్‌టౌన్, ఫిబ్రవరి 28: ఎన్టీఆర్ జిల్లాలో 1,781 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని, ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రభుత్వ యంత్రాంగం పనిచేస్తోందని కలెక్టర్ ఢిల్లీరావు తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలప్రతినిధులతో కలెక్టరేట్‌లో బుధవారం ఆయన సమావేశమయ్యారు. ఎన్నికల నిర్వహణకు ప్రణాళికాబద్ధంగా ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన తెలిపారు. జిల్లాలో 169 మంది సెక్టార్ అధికారులు, 169 సెక్టార్ పోలీసు అధికారులు, 800 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించినట్లు తెలిపారు. సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లను గుర్తిస్తామని, రాజకీయపార్టీలు సూచనలిస్తే ఆమేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. దినపత్రికల్లో వచ్చిన నెగిటివ్ కథనాలపై వివరణలను ప్రతినిధులకు అందించారు. డీసీపీ కృష్ణకాంతి, డీవీ కృష్ణ(సీపీఎం), బి.అనిల్(టీడీపీ), అశోక్ షరన్(కాంగ్రెస్), పీవీ శ్రీహరి (బీజేపీ), కె.పరమేశ్వరరావు(ఆప్), పి.రాజశేఖర్(వైసీపీ), ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ ఎం.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

కృష్ణాలో రూ.31.90 కోట్ల పీఎం కిసాన్ నిధులు జమ

- రూ.7.03 కోట్ల సున్నావడ్డీ విడుదల: కలెక్టర్ రాజాబాబు

మచిలీపట్నం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): కృష్ణాజిల్లాలో 1,58,485 మంది రైతుల ఖాతాల్లో రూ.31.90 కోట్ల పీఎం కిసాన్-రైతుభరోసా నిధులు జమ చేస్తున్నట్లు కలెక్టర్ పి.రాజాబాబు తెలిపారు. 2021-22 రబీ, 2022-23 ఖరీఫ్ సీజన్లకు 40,182మంది రైతులకు రూ.7.03కోట్ల సున్నావడ్డీ నిధులు విడుదల చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి రైతు భరోసా, పంటరుణాలకు సున్నావడ్డీ నిధులను సీఎం జగన్ విడుదల చేసిన సందర్భంగా వర్చువల్ పద్ధతిలో కలెక్టరేట్‌లోని వీడియోకాన్ఫరెన్స్ హాలు నుంచి కలెక్టర్ రాజాబాబు, జేసీ గీతాంజలిశర్మ, వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ జన్ను రాఘవరావు, రైతులు పాల్గొన్నారు. మెగా చెక్కులను రైతులకు కలెక్టర్, జేసీ అందించారు. ఆర్టీసీ రీజినల్ ఛైర్మన్ పిన్నింటి మహేష్, వ్యవసాయశాఖ జేడీ పద్మావతి, డీఎస్వో పార్వతి, ఉద్యానశాఖ జేడీ జె.జ్యోతి పాల్గొన్నారు.



మచిలీపట్నం కలెక్టరేట్‌లో రైతులకు చెక్కును అందజేస్తున్న కలెక్టర్ రాజాబాబు, జేసీ గీతాంజలి శర్మ

ఎన్టీఆర్ జిల్లాలో రూ.28.73 కోట్లు లబ్ధి



విజయవాడ కలెక్టరేట్‌లో చెక్కును రైతులకు అందజేస్తున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు, మేయర్ భాగ్యలక్ష్మి

వన్‌టౌన్, ఫిబ్రవరి 28: ఎన్టీఆర్ జిల్లాలో 1,42,011 మంది రైతులకు పీఎం కిసాన్-రైతు భరోసా పథకంలో భాగంగా రూ.28.73 కోట్లు లబ్ధి చేకూరిందని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. 30,405 మంది రైతులకు రూ.7.72 కోట్ల సున్నా వడ్డీ రాయితీలను రైతుల ఖాతాల్లో జమచేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి సీఎం జగన్మోహన్‌రెడ్డి బుధవారం ఐదో ఏడాది మూడో విడత నిధులను బటన్ నొక్కి రైతుల ఖాతాల్లోకి జమచేశారు. అనంతరం ఆయన నిర్వహించిన వీడియో సమావేశంలో నగరంలోని కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ ఢిల్లీరావు, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి పాల్గొన్నారు. లబ్ధిదారులకు మెగా చెక్‌ను వారు అందజేశారు. 2021-22 రబీ సీజన్ 2022 ఖరీఫ్ సీజన్‌లలో పంట రుణాలు తీసుకుని సకాలంలో డబ్బు చెల్లించిన వారికి వడ్డీ రాయితీని నేరుగా ఖాతాల్లో జమ చేస్తున్నామన్నారు. సొంత భూమి సాగు చేసుకుంటున్న రైతులకు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కౌలు రైతులకు ఆర్ఓఎఫ్ఆర్ రైతులకు రైతు భరోసా సాయం అందుతుందన్నారు. డిప్యూటీ మేయర్లు అవుతు శ్రీశైలజారెడ్డి, బెల్లం దుర్గ, కాపు కార్పొరేషన్ ఛైర్మన్ అడపా శేషగిరి, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ షేక్ ఆసిఫ్, జైన్ కార్పొరేషన్ ఛైర్మన్ మనోజ్ కొఠారి, పారిశ్రామిక అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ బండి శివశక్తి పుణ్యశీల, వ్యవసాయ సలహా మండలి జిల్లా ఛైర్మన్ డి.దామోదర్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ జిల్లా ఛైర్‌పర్సన్ జమల పూర్ణమ్మ, వ్యవసాయ, ఉద్యాన శాఖ జిల్లా అధికారులు ఎస్.నాగమణెమ్మ, పి.బాలాజీకుమార్ పాల్గొన్నారు.



ఉయ్యూరులో శిడిబండిని సిద్ధం చేస్తున్న కార్మికులు

వీరమ్మ శిడిబండి వేడుక నేడు

ఉయ్యూరు, ఫిబ్రవరి 28: వీరమ్మతల్లి తిరునాళ్లలో 11వరోజు గురువారం శిడిబండి వేడుకను అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. అనాదిగా వస్తున్న ఆచారం ప్రకారం వివాహానికి సిద్ధంగా ఉన్న దళిత కుంబానికి చెందిన ఓ యువకుడిని శిడిబండికి కట్టిన ఉట్టిబుట్టలో కూర్చోబెట్టి ఆలయ ప్రదక్షిణ చేయిస్తారు. అనంతరం శివాలయం కొబ్బరితోట సమీపం నుంచి డప్పు వాయిద్యాలు, మేళతాళాల మధ్య వేలాది భక్తుల హారతులు అందుకుంటూ, ఊరేగింపుగా ప్రధానసెంటర్, ఊయల స్తంభాల నుంచి శిడిబండి ఆలయానికి చేరుకుంటుంది. వేడుకను తిలకించేందుకు భక్తులు వేలాదిగా తరలి వస్తారు. వేడుకకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నటు గన్నవరం డీఎస్పీ జయసూర్య తెలిపారు.



ఒప్పంద పత్రాలతో కేయూ వీసీ జి.జ్ఞానమణి, సిలికానాంధ్ర వ్యవస్థాపకుడు కూచిభొట్ల ఆనంద్

కృష్ణా విశ్వవిద్యాలయంతో సిలికానాంధ్ర ఎంవోయూ

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 28: విద్య, పరిశోధనా రంగాల్లో పరస్పర అవగాహన కోసం కృష్ణా విశ్వవిద్యాలయంతో సిలికానాంధ్ర సంస్థ ఒప్పందం కుదుర్చుకుంది. బుధవారం కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి జి.జ్ఞానమణి, సిలికానాంధ్ర వ్యవస్థాపక అధ్యక్షుడు కూచిభొట్ల ఆనంద్ ఒప్పంద పత్రాలను చూపారు. విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ పి.వీరబ్రహ్మచారి, కూచిభొట్ల ఆనంద్ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. కృష్ణా విశ్వవిద్యాలయం సూచించిన ఐదుగురికి అమెరికాలోని తమ విశ్వవిద్యాలయంలో ఉచిత విద్య, శిక్షణ, ఇంటర్న్‌షిప్ ఇస్తామని కూచిభొట్ల ఆనంద్ తెలిపారు. విశ్వవిద్యాలయ ఆర్థిక గణాంక అధికారి రతన్, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సుందరకృష్ణ, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ విజయకుమారి, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాంబాబు, కంప్యూటర్ సైన్స్ విభాగ సహాచార్యులు డాక్టర్ కిరణ్‌కుమార్, డాక్టర్ బాపురెడ్డి, ఎన్ఎస్ఎస్ విభాగ సమన్వయకర్త డాక్టర్ ఎం.శ్రావణి పాల్గొన్నారు.

మండలి బుద్ధప్రసాద్
వైసీపీలో చేరడం లేదు

- ఆ పార్టీ నుంచి ఆహ్వానం వాస్తవమే
- అవాస్తవ ప్రచారాలను అవనిగడ్డ నియోజకవర్గ ప్రజలు నమ్మొద్దు
- కుమారుడు మండలి వెంకట్రామ్ స్పష్టీకరణ

అవనిగడ్డ, ఫిబ్రవరి 28: "మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ వైసీపీలో చేరుతున్నారన్న ప్రచారంలో వాస్తవం లేదు. మాకు వైసీపీ నుంచి ఆహ్వానం వచ్చిన మాట వాస్తవమే. కానీ ఆ పార్టీలో చేరడం లేదు. అవాస్తవ ప్రచారాలను నియోజకవర్గ ప్రజలు నమ్మొద్దు." అని ఆయన కుమారుడు టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మండలి వెంకట్రామ్ స్పష్టం చేశారు. మంగళవారం సాయంత్రం నుంచి సామాజిక, ప్రసార మాధ్యమాల్లో బుద్ధప్రసాద్ వైసీపీలో చేరుతున్నట్లు భారీగా ప్రచారం జరగడంతో బుధవారం వెంకట్రామ్ సామాజిక మాధ్యమాల వేదికగా స్పందించారు.

మూడు రాజధానులంటూ రాష్ట్రాన్ని నాశనం చేశారు

- జగన్‌పై వసంత నాగేశ్వరరావు ఆగ్రహం

వీరులపాడు, ఫిబ్రవరి 28: ఎన్నికలకు ముందు అమరావతే రాజధాని అని చెప్పి అధికారంలోకి వచ్చాక మూడు రాజధానుల ఆట మొదలు పెట్టి సీఎం జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని నాశనం చేశారని మాజీ మంత్రి వసంత నాగేశ్వరరావు ఆగ్రహం వ్యక్తంచేశారు. వెల్లంకి గ్రామంలో ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు హయాంలో ఐటీ సెక్టార్ కారణంగా ఎంతోమంది యువతకు విదేశాల్లో ఉద్యోగాలు చేసే అవకాశం వచ్చిందన్నారు. జగన్ ఐదేళ్ల పాలనలో పరిశ్రమలు రాష్ట్రం నుంచి పారిపోయి యువతకు ఉద్యోగాలు లేక పక్క రాష్ట్రాలకు పయనమయ్యారన్నారు. ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేస్తున్న జగన్ నిధులు మాత్రం విడుదల చేయలేదన్నారు. రాష్ట్రంలో రోడ్ల పరిస్థితి దారుణంగా ఉందని, ప్రజలకు మౌలిక వసతుల కల్పన లేదని ఆయన విమర్శించారు.

పదో తరగతి విద్యార్థులకు 4 నుంచి
మోడల్ గ్రాండ్ టెస్టులు

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 28: కృష్ణాజిల్లాలో కలెక్టర్ రాజాబాబు ఆదేశాల మేరకు మార్చి నాలుగో తేదీ నుంచి పదో తరగతి విద్యార్థులకు మోడల్ గ్రాండ్ టెస్టులు నిర్వహిస్తున్నట్లు డీఈవో తాహెరా సుల్తానా తెలిపారు. బుధవారం డీఈవో విలేకరులతో మాట్లాడారు. విద్యార్థుల్లో పరీక్షలంటే భయంపోయేలా నాలుగు విడతల సైకిల్ టెస్టులు నిర్వహించామని తెలిపారు. పబ్లిక్ పరీక్షలు మార్చి 18వ తేదీ నుంచి ఏప్రిల్ 2వతేదీ వరకు నిర్వహిస్తున్నారని విద్యార్థులకు పరీక్షలపై అవగాహన పెంపెందించేందుకు, విద్యలో వెనుకబడిన విద్యార్థులకు ప్రశ్నపత్రాలపై మరింత అవగాహన కల్పించేందుకు గ్రాండ్ టెస్టులు ఉపయోగపడతాయని డీఈవో తెలిపారు. సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించనున్న దృష్ట్యా విద్యార్థులు అలసిపోకుండా చూఆలని వారిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇవ్వాలని ప్రధానోపాధ్యాయులను డీఈవో తాహెరా సుల్తానా ఆదేశించారు.

గంగానమ్మ విగ్రహప్రతిష్ఠకు యార్లగడ్డ రూ.లక్ష విరాళం

ఉంగుటూరు, ఫిబ్రవరి 28 : పెదఅవుటపల్లిలో కొలువైవున్న గ్రామదేవత గంగానమ్మతల్లి నూతన ఆలయ నిర్మాణం, విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. ఈ విషయాన్ని స్థానిక టీడీపీ నేతలు టీడీపీ గన్నవరం ఇన్‌చార్జి యార్లగడ్డ వెంకట్రావు దృష్టికి తీసుకెళ్లగా, వెంటనే ఆయన తనవంతు సాయంగా లక్ష రూపాయల విరాళాన్ని తన సోదరుడు యార్లగడ్డ సతీష్‌కు ఇచ్చి పంపారు. బుధవారం గంగానమ్మ విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమానికి హాజరైన సతీష్, స్థానిక పార్టీనేతల సమక్షంలో లక్ష చెక్కును ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపార్టీ అధ్యక్షుడు మున్నా రామకృష్ణ, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి ఆళ్ల హనోక్, మాజీ పీఏసీఎస్ ఛైర్మన్ మాదల భాస్కరరావు, యార్లగడ్డ అజయ్, శేఖర్ పాల్గొన్నారు.

టీడీపీ, జనసేనలో జోష్

● తాడేపల్లిగూడెం సభకు భారీగా తరలిన టీడీపీ, జనసేన శ్రేణులు



తాడేపల్లిగూడెం ఉమ్మడి సభకు తరలివెళ్తున్న టీడీపీ శ్రేణులతో బోడె ప్రసాద్

పెనమలూరు, ఫిబ్రవరి 28 : టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తల్లో జోష్ పెరిగింది. బుధవారం తాడేపల్లిగూడెంలో జరగనున్న భారీ బహిరంగ సభకు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. టీడీపీ నాయకులు, జనసైనికులు పోరంకి టీడీపీ కార్యాలయం వద్దకు పెద్ద ఎత్తున చేరుకొన్నారు వారికి మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ స్వాగతం పలికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జాగ్రత్తగా వెళ్లి ఆనందంగా ఇంటికి చేరాలని బోడె ప్రసాద్ ఇరుపార్టీల కార్యకర్తలకు సూచించారు. జనసేన తాడిగడప కార్యాలయం నుంచి మునిసిపాలిటీ అధ్యక్షుడు తాతపూడి గణేష్ నేతృత్వంలోని జనసేన శ్రేణులు సభకు పయనమయ్యారు. సుమారు వంద కార్లలో కార్యకర్తలు తరలి వెళ్లారు. ఇరు పార్టీల కార్యాలయాల వద్ద బుధవారం పార్టీల అభిమానులు, కార్యకర్తలు, నాయకులతో సందడి నెలకొంది.

వైసీపీలో వణుకు మొదలైంది..



కంకిపాడు నుంచి..

కంకిపాడు : జనసేన, తెలుగుదేశం పార్టీలు సంయుక్తంగా చేపట్టిన ప్రచార సభలతో అధికార వైసీపీలో వణుకు మొదలైందని జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయ కర్త ముప్పా రాజా, ఉమ్మడి కృష్ణాజిల్లా ప్రచార కమిటీ కో ఆర్డినేటర్ పులి కామేశ్వరరావు అన్నారు. తాడేపల్లిగూడెంలో బుధవారం నిర్వహించిన జనసేన, టీడీపీ ఉమ్మడి సభకు పెనమలూరు నియోజకవర్గం నుంచి సుమారు వంద కార్లలో భారీగా జనసేన పార్టీ నాయ కులు కార్యకర్తలు తరలి వెళ్లారు. ముప్పా రాజా, పులి కామేశ్వరరావులు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పెనమలూరు, కంకిపాడు, ఉయ్యూరు పట్టణాలకు చెందిన జనసేన పార్టీ నాయకులు తాడిపూడి నగేష్, నాగేశ్వరి, బోయిన నాగరాజు, సుంకర సురేష్, సుంకర శివ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో రాష్ట్రం నాశనం

హనుమాన్‌జంక్షన్ : వైసీపీ పాలనలో రాష్ట్రం 30 ఏళ్ల వెనక్కి వెళ్లిందని టీడీపీ రాష్ట్ర నాయకుడు ఆళ్ల గోపాలకృష్ణ అన్నారు. తాడేపల్లిగూడెంలో బుధవా రం సభ విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ స్థానిక అభయాంజనేయస్వామి ఆలయంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చిరుమామిళ్ల సూర్యం, రాష్ట్ర కార్యదర్శి దొంతు చిన్నాతో కలసి ఆళ్ల ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి ఆశీర్వచనాలతో పాటు స్వామివారి చిత్రపటం, కండువాను సభలో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు ఇవ్వడానికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో నాయకులు వేగిరెడ్డి పాపారావు, అట్లూరి శ్రీనివాసరావు, లింగం శ్రీధర్, మండాడి రవీంద్ర, వెనిగళ్ల జ్ఞానశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామికి ఎంపీ బాలశౌరి ప్రత్యేకపూజలు

ఎంపీ వల్లభనేని బాలశౌరి స్థానిక అభయాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తాడేపల్లిగూడెంలో బుధవారం జరగనున్న సభకు వందలాది మంది కార్యకర్తలతో కలిసి తరలి వెళ్లారు. మార్గమధ్యంలోని హనుమాన్‌జంక్షన్‌లో ఆయన అభయాంజనేయస్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా జనసేన గన్నవరం సమన్వయకర్త చలమలశెట్టి రమేష్‌బాబు నాయకత్వంలో కార్యకర్తలు, అభిమానులు ఘనంగా స్వాగతం పలికారు. గజమాలతో సత్కరించారు.



జంక్షన్‌లో బాలశౌరి పూజలు

రేమల్లేలో..



రేమల్లి నుంచి..

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : రాష్ట్ర భవిష్యత్తుతో పాటు పేదలకు సకాలంలో సంక్షేమ పథకాలు అందాలన్నా, ప్రభుత్వ ఉద్యోగులకు గౌరవం దక్కాలన్నా టీడీపీ- జనసేన సంయుక్త ప్రభుత్వంతోనే సాధ్యమని అందుకు ప్రతి ఒక్కరూ, మద్దతు పలకాలని టీడీపీ నాయకుడు యనమదల సుధాకర్ అన్నారు. రేమల్లె నుంచి తెలుగు తమ్ముళ్లు బుధవారం తాడేపల్లిగూడెంలో సభకు ర్యాలీగా తరలి వెళ్లారు. యనమదల శ్రీనివాసరావు, విజయానంద్, తుమ్మల మధు, కలపాల కుమార్, ప్రదీప్, తొమ్మండ్రు మహేష్, తదితరులు రేమల్లె నుంచి కార్లతో ర్యాలీగా బయలుదేరి వెళ్లారు.

పేరంటాలమ్మకు రూ. లక్ష విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

గుణదల, ఫిబ్రవరి 28 : రామవరప్పాడులోని వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయానికి ఒక భక్తురాలు రూ. 1,00,116 విరాళంగా అందజేసినట్టు ఆలయ కార్య నిర్వహణ అధికారిణి పాతూరి లోకేశ్వరి తెలిపారు. ప్రసాదంపాడుకు చెందిన కోన నాగేశ్వరరావు మనవరాలు విన్నకోట నాగ వెంకటసాయి హర్షిణి పేరంటాలమ్మకు చెక్కు రూపంలో విరాళం బుధవారం అందజేశారు. దాత కుటుంబ సభ్యులకు ఆలయ అర్చకులు శేషవస్త్రం కప్పి ఆశీర్వాదం అందజేశారు.

ఆకతాయిలకు కౌన్సెలింగ్

కంకిపాడు, ఫిబ్రవరి 28 : ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల వద్ద ఆకతాయిలు కనిపిస్తే ఉపేక్షించేది లేదని కంకిపాడు ఎస్సై డి. సందీప్ అన్నారు. కంకిపాడు మండలంలోని పునాదిపాడు, ఈడుపుగల్లు జిల్లా పరిషత్ పాఠశాలల వద్ద తిరుగుతున్న ఆకతాయిలను అదుపులోకి తీసుకొని బుధవారం వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెనమలూరు, ఫిబ్రవరి 28 : యనమలకుదురు విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతులు, 11కేవీ లైన్ మరమ్మతుల నేపథ్యంలో నేడు యనమలకుదురులో ఉదయం 8 నుంచి ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏఈ హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు.

వీరమ్మ తిరునాళ్లకు భక్తుల రద్దీ



తిరునాళ్లకు తరలిచ్చిన భక్తులు

ఉయ్యూరు, ఫిబ్రవరి 28 : వీరమ్మ తిరునాళ్లకు భక్తులు పలు ప్రాంతాల నుంచి తరలి వస్తున్నారు. ఈ నెల 19న భీష్మ ఏకాదశి రోజున ప్రారంభమై పదిహేను రోజులపాటు జరిగే తిరునాళ్ల మరో ఐదు రోజుల్లో ముగియ నుండగా రెండు తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించి మొక్కు తీర్చుకుంటున్నారు. ఈ క్రమంలో బుధవారం మహిళలు పొంగళ్లు తయారు చేసి అమ్మవారికి నైవేద్యం సమర్పించేందుకు క్యూల్లో నిలబడ్డారు. మరి కొందరు పొంగళ్లతో ఆలయంలోనికి ప్రవేశించేందుకు గేట్ల వద్ద గుమికూడగా కొద్ది పాటి తోపులాట జరిగింది.

భవన నిర్మాణ కార్మికుల
సమస్యలు పరిష్కరించాలి



గన్నవరంలో దీక్షలు చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

గన్నవరం, ఫిబ్రవరి 28 : భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉన్న పార్టీలకే రానున్న ఎన్నికల్లో ఓటు వేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చౌటపల్లి రవి అన్నారు. స్థానిక సుందరయ్య విగ్రహం వద్ద భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ రిలే దీక్షలు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలోని భవన నిర్మాణ కార్మికులు తమ సంక్షేమ పథకాలు, వెల్ఫేర్ బోర్డు ద్వారా అమలు చేయాలని, 1214 మెమోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ దీక్షలో కళ్లం వెంకటేశ్వరరావు, శ్రీనివాసరెడ్డి, ప్రసాద్, నాగేశ్వరరావు, మరియదాసు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు నిధులు దుర్వినియోగం దుర్మార్గం

హనుమాన్‌జంక్షన్ : భవన నిర్మాణ కార్మికుల ఐక్య పోరాటాలు ద్వారా సాధించుకున్న సంక్షేమ బోర్డు నిధులను దుర్వినియోగం చేస్తూ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం అన్యాయం చేయడం దుర్మార్గమని సీఐటీయూ బాపులపాడు మండల అధ్యక్షుడు బేత శ్రీనివాసరావు అన్నారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ద్వారా అన్ని పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం స్థానిక నాలుగు రోడ్లు కూడలిలో భవన నిర్మాణ కార్మిక సంఘం (సీఐటీయూ) హనుమాన్‌జంక్షన్ శాఖ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు.

భావిభారత శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దటానికి
వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదం



రవీంద్రభారతిలో సైన్స్ దినోత్సవ వేడుకలను ప్రారంభించిన డాక్టర్ షర్మిల

గన్నవరం, ఫిబ్రవరి 28: వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థులలో ఉన్న జిజ్ఞాసను పెంపొందించటంతో పాటు వారిని భావిభారత శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దటానికి దోహదప డుతుందని డాక్టర్ టీ షర్మిల అన్నారు. బుధవారం రవీంద్రభారతి స్కూల్‌లో జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సైన్స్ ఎగ్జిబిషన్ పోటీలు నిర్వహించారు. న్యాయనిర్ణేతలుగా డీ అమల, ఎం రవీంద్ర కుమార్ లు వ్యవహరించారు. విజేతలైన విద్యార్థులకు ముఖ్య అతిథి డాక్టర్ టీ షర్మిల చేతుల మీదుగా బహుమతులను అందచేశారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్స్ ప్రదర్శనను తల్లిదండ్రులను వీక్షించటానికి స్కూల్ యాజమాన్యం ఆహ్వానించింది. దీంతో ఈ కార్యక్రమంలో రవీంద్రభారతి స్కూల్ జీఎం కే రాజేష్, జోనల్ ఇన్‌చార్జి యు రమేష్, ఏఓ ఎన్. వంశీధర్, ఏ హసీన పాల్గొన్నారు. ● విద్యార్థులు సైన్స్ పట్ల ఆసక్తి పెంపొందించుకోవాలని ప్రిన్సిపాల్ దాసరి మాధవీలత అన్నారు. స్థానిక శ్రీ మల్లికార్జున హైస్కూల్‌లో జాతీయ సైన్స్‌డేను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాధవీలత మాట్లాడుతూ విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు సైన్స్ ఎక్స్‌పోలు దోహదపడతాయన్నారు. విద్యారులను ప్రిన్సిపాల్ మాధవీలతతో పాటు కరస్పాం డెంట్ నక్కిన చిన వెంకట్రా యుడు, ఉపాధ్యాయులు అభినందించారు.



విద్యార్థులు చేసిన సైన్స్ ప్రాజెక్టులను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ మాధవీలత

దర్జీలకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలి

టీడీపీ గన్నవరం అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు



కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న యార్లగడ్డ వెంకట్రావు

గుణదల, ఫిబ్రవరి 28 : ఆధునిక ప్రపంచంలో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న దర్జీలకు సమాజంలోని ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని టీడీపీ గన్నవరం అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు పిలుపునిచ్చారు. ప్రపంచ టైలర్స్ దినోత్సవ వేడుక ప్రసాదంపాడులోని వివాకానంద స్కూల్ గ్రౌండ్‌లో బుధవారం నిర్వహించారు. ముందుగా ఆయన సొంత నిధులతో సమకూర్చిన 20 కుట్టు మిషన్లను పేద దర్జీలకు పంపిణీ చేశారు. రాబోయే టీడీపీ, జనసేన ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దాసరి శ్రీను, వి.శ్రీనివాసరావు, ఎనికేపాడు రాజు, శ్రీనివాసరావు పాల్గొన్నారు. **ఉయ్యూరు :** ఉయ్యూరు టైలర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం టైలర్స్‌డే నిర్వహించారు. ప్రధాన సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టైలర్స్ పితా మహుడు విలియమ్స్ హావే చిత్రపటానికి పూల మాలవేసి ఘనంగా నివాళులర్పిం చారు. యూనియన్ అధ్యక్షుడు జి. వెంకట్రావు, అబ్దుల్ రసూల్, ఎండీ ఆదిల్ అన్సారీ, వీర వెంకటేశ్వరరావు, వినయ్, శ్రీను, అప్పరావు, అగ్గిరాముడు ఇబ్రహీం పాల్గొన్నారు.
హనుమాన్‌జంక్షన్ : చేతి వృత్తి మీద ఆధారపడి జీవనం సాగిస్తున్న టైలర్స్ కుటుంబాలను ఆదుకోవాల్సిన అవసరం ఎంతైన ఉందని హనుమాన్‌జంక్షన్ టైలర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు ఎండీ అక్బర్ షరీఫ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం అసోసియేషన్ ఆధ్వర్యంలో టైలర్స్ డే సందర్భంగా బాపులపాడు పంచాయతీ కార్యాలయం వద్ద సభ నిర్వహించారు.

ఉపాధి పనుల్లో పారదర్శకత పాటించాలి

ఉంగుటూరు, ఫిబ్రవరి 28 : ఉపాధిహామీ పనుల్లో నాణ్యత, పారదర్శకత, జవా బుదారీతనం పాటించాలని, వలసలు నివారించి స్థానికంగా పనులు కల్పించడమే లక్ష్యంగా సిబ్బంది పనిచేయాలని ఇందుపల్లి సర్పంచ్ బండి వెంకటలక్ష్మి అన్నారు. మండలంలోని ఇందుపల్లి, ఉంగుటూరు, వెన్నూతల, ఎలుకపాడు, చికినాల, తుట్టగుంట, బొకినాల, నాగవరప్పాడు, మధిరపాడు గ్రామాల్లో బుధవారం ఉపాధిహామీ సామాజిక తనిఖీ ముగింపు గ్రామసభలు జరిగాయి. తొలుత రెండు రోజులపాటు ఆయా గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించిన తనిఖీ అధికారులు గత ఏడాది జరిగిన పనులపై వివరాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్పీలు ఎన్, గోపి, ఎం.నాగరాజు, జి.కళ్యాణ్‌కుమార్, ఎం.సాగరబాబు, పిట్టా రమేష్, టి.నాగరాజు, స్వతంత్ర పరిశీలకులు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

మార్చి 5న సామాజిక తనిఖీ ప్రజావేదిక

ఉపాధి హామీ పథకంలో భాగంగా గత ఏడాది మండలంలోని 27గ్రామాల్లో జరిగిన పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక మార్చి 5న స్థానిక మండల కార్యాలయంలో నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ఈ.మహేశ్వరరావు తెలిపారు.

ఇన్‌చార్జి ఎంఈవోపై డీవైఈవో విచారణ

ఉంగుటూరు, ఫిబ్రవరి 28 : తన సహోద్యోగులు, సిబ్బంది, టీచర్ల పట్ల మండల ఇన్‌చార్జి ఎంఈవో-1 వ్యవహరిస్తున్న తీరుపై పలు ఆరోపణలు వెల్లువెత్తిన నేపథ్యంలో ఉయ్యూరు డీవైఈ వో. ఐ.పద్మారాణి బుధవారం విచారణ చేపట్టారు. కృష్ణాజిల్లా, ఉంగుటూరు మండలం, ఇన్‌చార్జి ఎంఈవో-1గా తోట్లవల్లూరు ఎంఈవో జి.వెంకటేశ్వరరావు మూడేళ్లుగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. మండలంలో పాఠశాలల సందర్శన, తనిఖీలు చేసే సందర్భంలో ఉపాధ్యాయులు, సీఆర్పీలతో పాటు, తన కార్యాలయ సిబ్బందిపై చీటికి మాటికి చిరాకు పడుతూ ఉద్దేశ పూర్వకంగా పరుష పదజాలంతో మాట్లాడుతూ వేధిస్తున్నారని, సభలు, సమావేశాల్లో తన సహోద్యోగి ఎంఈవో-2 జె.సాంబశివరావు పట్ల కూడా చులకనగా మాట్లాడుతున్నారని మండలంలోని పలు పాఠశాలల టీచర్లు, సీఆర్పీలు, సిబ్బంది ఉన్నతాధికారులకు లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. డీఈవో తాహెరా సుల్తానా ఆదేశాల మేరకు బుధవారం స్థానిక ఎంఈవో కార్యాలయంలో విచారణ చేపట్టిన డీవైఈవో పద్మారాణి, ఉపాధ్యాయులను, సిబ్బందిని విడివిడిగా విచారించారు.

వేలేరు హైస్కూల్‌లో చోరీ

● రెండు ల్యాప్‌టాప్‌లు ● విద్యుత్ సామగ్రి..

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఫిబ్రవరి 28 : వేలేరు హైస్కూల్‌లో జరిగిన చోరీ ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వేలేరు హైస్కూల్‌లో ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి విలువైన వస్తువులను దొంగతనం చేసిన విషయంపై హెచ్‌ఎం విజయ్ సోమవారం హనుమాన్ జంక్షన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా బుధవారం ఎస్సై జనార్దన్ ఘటనాస్థలాన్ని పరిశీలించారు. హెచ్‌ఎం కొమ్మా విజయ్ తెలిపిన వివరాల ప్రకారం.. విద్యార్థులకు ఉపయుక్తంగా దాత లిచ్చిన ల్యాప్‌టాప్‌తో పాటు ప్రభుత్వం ఇచ్చిన ల్యాప్‌టాప్ రెండూ చోరీకి గురవ్వగా, నూతన భవనానికి విద్యుత్ నిమిత్తం మంజూరు చేసిన రూ. 35వేల విలువైన విద్యుత్ సామగ్రి, రూ.15 వేలు విలువగల 20కిపైగా ట్యూబ్‌లైట్లు చోరీకి గురైనట్లు వివరించారు.

వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో
వైభవంగా ప్రారంభమైన ఎఫోసెక్-2024



బొల్లేపల్లి మాధవిని సత్కరిస్తున్న కళాశాల యాజమాన్యం

పెనమలూరు, ఫిబ్రవరి 28 : కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం రెండు రోజుల పాటు జరిగే ఎఫోసెక్-2024 ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. కళాశాల విద్యార్థులు ఉత్సవంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పూర్వ విద్యార్థిని, మైక్రోసాఫ్ట్ కంపెనీ సీనియర్ డైరెక్టర్ బొల్లేపల్లి మాధవి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ, ప్రపంచంలో వస్తున్న మార్పులకనుగుణంగా సాంకేతికతను అందిపుచ్చుకోవాలన్నారు. సీటీఎస్ మేనేజర్ జితేందర్‌సింగ్ మాట్లాడుతూ, సాంకేతిక నైపుణ్యంతోపాటు సాఫ్ట్ స్కిల్స్‌ను విద్యార్థులు నేర్చుకోవాలని సూచించారు. కళాశాల కన్వీనర్ మలినేని రాజయ్య మాట్లాడుతూ, కళాశాల త్వరలో విశ్వవిద్యాలయ స్థాయిని అందుకోనుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అకాడమీ కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఏవీ రత్నప్రసాద్, డాక్టర్ దువ్వాడ రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	148, 157, 168
చికెన్ విత్ స్కిన్	286
చికెన్ స్కిన్‌లెస్	296

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.75

కేఆర్‌యూలో ఓట్ల లెక్కింపు కేంద్రం కలెక్టర్ సందర్శన



మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 28: కృష్ణా విశ్వవిద్యాలయంలో ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు బుధవారం కలెక్టర్ పి రాజాబాబు విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. రిజిస్ట్రారు బ్రహ్మచారితో చర్చించి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అకాడమీ బ్లాక్‌లో గ్రౌండ్ ఫ్లోర్‌తోపాటు మొదటి రెండు అంతస్తులు కేటాయించేందుకు నిర్ణయాలు తీసుకున్నారు. డీఆర్వో చంద్రశేఖరరావు, ముడ వీసీ వెంకటరమణ, వీసీ జ్ఞానమణి, రిజిస్ట్రార్ బ్రహ్మచారి, ఆర్డీవో వాణి, సర్వే ఏడీ వెంకటేశ్వరరావు, సర్వేయర్ రాజబాబు, తహసీల్దార్ సతీష్ పాల్గొన్నారు.

పాడి రైతులకు గుండె పరీక్షలు

పెడన, ఫిబ్రవరి 28: కృష్ణామిల్క్ యూనియన్ ఆధ్వర్యంలో గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న ఘంటలమ్మపాలెం, కట్లపల్లి, కౌతవరం, నడుపూరు పాల సంఘాలకు చెందిన 16మంది పాల ఉత్పత్తిదారులకు విజయవాడలోని వరుణ్ కార్డియాక్ సైన్సెస్ ఆసుపత్రిలో డాక్టర్ వరణ్ బుధవారం యాంజియోగ్రామ్ పరీక్షలు నిర్వహించారు. యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు పర్యవేక్షణలో ఈ యాంజియోగ్రామ్ పరీక్షలు జరిగాయి.

శ్మశాన వాటిక సర్వే

అవనిగడ్డ రూరల్, ఫిబ్రవరి 28: మండల పరిధిలోని పులిగడ్డ గ్రామానికి సంబంధించి హిందూ స్మశాన వాటిక సర్వే చేసి రాళ్లతో బౌండరీస్ ఏర్పాటు చే శారు. కలెక్టర్ రాజాబాబు ఆదేశాల మేరకు 40 సెంట్ల భూమిని రెవెన్యూ, జలవనరుల శాఖ అధికారులతో అనుమతులతో సర్వే చేశారు. పులిగడ్డ రెవెన్యూ రికార్డుల్లో, పంచాయతీ రికార్డుల్లో అధికారికంగా నమోదు చేయటం జరిగిందని, రుద్రభూమి ఏర్పాటు చేసిన అధికారులకు పులిగడ్డ సర్పంచ్ దాసరి విజయ్ కుమార్, ఉపసర్పంచ్ మండలి వెంకటేశ్వరరావు, గ్రామస్థులు అభినందనలు తెలిపారు.

కాలువ గట్లపై చెట్లు నరికివేత



మోపిదేవి, ఫిబ్రవరి 28: ఎలాంటి అనుమతులు లేకుండా మోపిదేవిలోని 11వ నెంబర్ కాలువ గట్టుపై ఉన్న చెట్టును గుర్తు తెలియని వ్యక్తులు నరికి వేశారు. మోపిదేవి ప్రధాన రహదారి నుంచి వెళ్లే 11వ నెంబర్ కాలువ గట్టుపై ఉన్న చెట్టును బుధవారం ఉదయం నరికివేతపై గ్రామస్థులు, రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రైతులు వ్యవసాయ పనుల్లో ఎంతో నీడనిచ్చే చెట్టును అధికారుల అనుమతి లేకుండా గుట్టుచప్పుడు కాకుండా నరికి వేశారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. గేటు ఏర్పాటు చేసి చెట్టును నరికివేసిన వ్యక్తులను గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని ఆయకట్టు రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

కిసాన్ చర్చా గోష్టి

ఘంటసాల, ఫిబ్రవరి 28: ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రంలో బుధవారం ప్రకృతి వ్యవసాయంపై రైతులతో, ప్రకృతి సేద్య సభ్యులతో శాస్త్రవేత్తలు కిసాన్ చర్చా గోష్టి నిర్వహించారు. కేవీకే శాస్త్రవేత్త బినవీన్ ఆధ్వర్యంలో ప్రకృతి సేద్య జిల్లా అధికారి పార్థసారథి పాల్గొని ప్రసంగించారు. ప్రకృతి వ్యవసాయంతో ప్రయోజనాలు, సమీకృత వ్యవసాయ పద్ధతులు, అధిక దిగుబడులు దిశగా ప్రకృతి సేద్య విధానాలు, మానవాళికి చేకూరే ప్రయోజనాలు భూమి ఆరోగ్య వివరాలను రైతులకు వివరించారు. ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ శ్రీలత, శాస్త్రవేత్తలు మంజువాణి, యశ్వం త్, కృష్ణవేణి, శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన ప్రభుత్వం ఖాయం

• తాడేపల్లిగూడెం తరలిన టీడీపీ, జనసేన శ్రేణులు

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 28: రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వం అధికారం చేపట్టడం ఖాయమని పలువురు నేతలు అన్నారు. తాడేపల్లిగూడెంలో తెలుగు జన విజయకేతన జెండా బహిరంగ సభకు పట్టణం నుంచి టీడీపీ, జనసేన నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో బుధవారం తరలి వెళ్లారు. టీడీపీ సీనియర్ నేత గొర్రెపాటి గోపీచంద్, నగరాధ్యక్షుడు ఎండీ ఇలియాస్ పాషా, టీడీపీ రూరల్ అధ్యక్షుడు కుంచే నానితో పాటు వివిధ గ్రామాలు, డివిజన్ల నుంచి టీడీపీ నేతలు, కార్యకర్తలు తరలివెళ్లారు. కాగా జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, నేతలు మాదివాడ రాము, గడ్డం రాజు పెద్ద సంఖ్యలో వాహనాలపై తాడేపల్లిగూడెం తరలివెళ్లారు.

అవనిగడ్డ నియోజకవర్గం నుంచి..

అవనిగడ్డ: తాడేపల్లిగూడెంలో తెలుగుదేశం-జనసేన సంయుక్తంగా నిర్వహిస్తున్న తెలుగు జన విజయ జెండాకు నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో జనసేన శ్రేణులు తరలివెళ్లాయి. అవనిగడ్డ నుంచి జనసేన పార్టీ అభ్యర్థిత్వంలో ఉన్న ప్రముఖ వ్యాపార వేత్త విక్కృత్తి శ్రీనివాస్ నేతృత్వంలో దాదాపు 200 వాహనాల్లో జనసేన కార్యకర్తలు తాడేపల్లిగూడెంకు తరలివెళ్లగా, మాదివాడ వెంకటకృష్ణ నేతృత్వంలో పెద్ద సంఖ్యలో జనసేన శ్రేణులు తాడేపల్లిగూడెం తరలివెళ్లారు. నేతలు బొప్పన భాను, గుడివాక శేషుబాబు, విక్కృత్తి రాంబాబు, రాయపూడి వేణుగోపాలరావు, రాజనాల వీరబాబు పర్యవేక్షించారు.



అవనిగడ్డలో జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న బొప్పన భాను, విక్కృత్తి రాంబాబు

మోపిదేవి: తెలుగుదేశం-జనసేన పార్టీలు ఉమ్మడిగా తాడేపల్లిగూడెంలో చేపట్టిన తెలుగు జన విజయ కేతనం బహిరంగ సభకు జనసైనికులు భారీగా తరలి వెళ్లారు. మండలంలోని ఆయా గ్రామాల నుంచి జన సైనికులు పెట్టిన ర్యాలీని మోపిదేవిలో పార్టీ మండలాధ్యక్షుడు పూషడపు రత్నగోపాల్ ప్రారంభించారు. భారీ ర్యాలీగా కార్లలో తాడేపల్లి గూడెం వెళ్తూ టీడీపీ, జనసేన కూటమి ఐక్యత వర్ధిల్లాలన్నారు. కూరేటి రాఘవ, మెరకనపల్లి నరేష్ ఉన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

• కలెక్టరేట్ ధర్నాచౌక్ వద్ద ధర్నా

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 28: భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలంటూ బుధవారం కలెక్టరేట్ ధర్నా చౌక్ వద్ద భవన నిర్మాణ కార్మికులు ధర్నా నిర్వహించారు. సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీ గోపాలరావు ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికులకు ఐదేళ్లుగా సంక్షేమ పథకాలు అమలు చేయడం లేదన్నారు. సంఘ నేతలు బండారు శ్రీనివాసరావు, పాల్, ఏడుకొండలు, చిట్టబ్బాయి, సంజీవరావు, నరసింహారావు పాల్గొన్నారు.

పెడనలో..

పెడన: భవన నిర్మాణ కార్మికులకు జగన్ తీరని అన్యాయం చేశాడని ఏపీ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నేతలు ఆరోపించారు. పట్టణంలోని బస్టాండ్ సెంటర్‌లోని అంబేడ్కర్ పార్కు ఎదుట బుధవారం రిలే నిరాహార దీక్ష చేశారు. ఈ సందర్భంగా యూనియన్ నేతలు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు అనేక సంవత్సరాలుగా అమలవుతున్న సంక్షేమ పథకాలను 1214 మెమో ద్వారా వైసీపీ ప్రభుత్వం నిర్దాక్షిణ్యంగా రద్దు చేసిందని దుయ్యబట్టారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 30 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులు వైసీపీకి వ్యతిరేకంగా ఓటు వేస్తున్నారన్నారు. టీడీపీ, జనసేన పార్టీల పెడన ఉమ్మడి అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్ శిబిరాన్ని సందర్శించి దీక్షకు సంఘీభావం తెలిపారు. ధనశ్రీ, పంచల నరసింహారావు, మాజేటి శివశ్రీనివాసరావు, గొల్లపల్లి నాగశేషుబాబు, షేక్ షమీమ్, కాగిత శ్రీనివాసరావు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ధర్నా చౌక్ వద్ద రిలే నిరాహార దీక్షలు నిర్వహించిన భవన నిర్మాణ కార్మికులు

అవనిగడ్డలో రిలే దీక్ష..

అవనిగడ్డ: భవన నిర్మాణ కార్మికులు కోరుతున్న న్యాయమైన డిమాండ్ల సాధనకు సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం అవనిగడ్డలో నిరసన దీక్ష చేపట్టగా, తెలుగుదేశం, జనసేన పార్టీలు ఈ దీక్షకు మద్దతు పలికాయి. సంక్షేమ బోర్డును వెంటనే అమలు చేయాలని, 12, 14 మెమోలను రద్దు చేయాలని డిమాండ్ చేయగా, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కరీముల్లా, బండి ఆదిశేషులు నేతృత్వం వహించారు. బుధవారం దీక్షలో అన్నపరెడ్డి నాగేశ్వరరావు, రాజశేఖర్, యాసం శ్రీనివాసరావుతో కలిపి 13 మంది దీక్షలో కూర్చోగా, జనసేన పార్టీ తరపున రాయపూడి వేణుగోపాలరావు, గుడివాక శేషుబాబు, బొప్పన భాను, రాజనాల వీరబాబు, మద్దతు తెలపగా, తెలుగుదేశం పార్టీ తరపున టీడీపీ జిల్లా అధ్యక్షుడు మండలి వెంకట్రామ్ దీక్షా శిబిరం వద్దకు వచ్చి మద్దతు తెలిపారు.

గుడివాడలో..

గుడివాడ : భవన నిర్మాణ కార్మికులకు అందించాల్సిన సంక్షేమ పథకాలు అమలు చేసి మెమో 1214ను వెంటనే రద్దు చేయాలని కోరుతూ సీఐటీయూ అనుబంధ భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట చేపట్టిన రెండు రోజుల రిలే నిరాహార దీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. పలు కార్మిక సంఘాలకు చెందిన నేతలు దీక్షాపరులకు సంఘీభావం తెలిపారు.

మొవ్వలో..

కూచిపూడి : బిల్డింగ్ కార్మికుల సంక్షేమ పథకాలు అమలు చేయాలని జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి వేము పెదబాబు అన్నారు. బుధవారం మొవ్వలో కృష్ణా జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో నిరాహారదీక్షను నిర్వహించారు. ఎస్.కె.అల్లా భక్షు, సుబ్రహ్మణ్యం, ఓరుగంటి బాబురావు, కాకి రాజశేఖర్, ఇంటి రాజు, ఏనుగు శ్రీనివాసరావు, ఇటికల ఏసుపాదం, బుద్దుల మురళీ, మన్నె మోహన్ దీక్షలో కూర్చున్నారు. కౌలు రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శీలం నారాయణ రావు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు గంగాధర ప్రసాద్ పాల్గొని సంఘీభావం తెలిపారు.

మనిషి అందం దర్జీలతోనే

• టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెనిగండ్ల



సమావేశంలో మాట్లాడుతున్న వెనిగండ్ల రాము

గుడివాడ: దర్జీల నేర్పరితనంతో రూపొందించిన వస్త్రాలతోనే మనిషి అందచందాలు బయటపడతాయని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి వెనిగండ్ల రాము అన్నారు. బుధవారం స్థానిక ఎన్‌జీవోస్ హోం నందు టైలర్స్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన టైలర్స్‌డే వేడుకల్లో స్థానిక ఎమ్మెల్యే కొడాలి నాని, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ వెనిగండ్ల రాము, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు పాల్గొని కుట్టు మిషన్ సృష్టికర్త విలియమ్స్ హోవే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్ళులర్పించారు. ఈసభలో రాము మాట్లాడుతూ చేతివృత్తిదారులైన టైలర్స్‌కు ప్రభుత్వం ప్రత్యేక రాయితీలు, ప్రోత్సాహకాలను యివ్వాలని డిమాండ్ చేశారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని సందర్శించారు. టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నాని, వెనిగండ్ల, రావికి ఆత్మీయ సత్కారం నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు లంకపల్లి లాజర్, గౌరవాధ్యక్షుడు రసూల్ బేగ్, కార్యదర్శి జన్ను శ్రీనివాసరావు, వర్కింగ్ అధ్యక్షుడు ఆత్మకూరు సాంబశివరావు, లీగల్ అడ్వైజర్ గుమ్మడి అప్పయ్య, టైలర్స్ పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు: పట్టణంలో బుధవారం టైలర్స్ డే ఘనంగా నిర్వహించారు. తొలుత టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం టైలరింగ్ పితామహుడు విలియం చిత్రపటానికి పూలమాలులు వేసి నివాళులర్పించారు. టైలర్స్ యూనియన్ అధ్యక్షుడు సూరి ప్రకాశరావు, కార్యదర్శి శంకరరావు, లక్ష్మణరావు, మురళి, బాజీ, హది, సాయి, శ్రీను పాల్గొన్నారు.

కోడూరు: దర్జీ బతుకుల్లో దర్జా నానాటికీ మాయమవుతోందని కోడూరు మండల టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు భూపతి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం వరల్డ్ టైలర్స్ డే సందర్భాన్ని పరిష్కరించుకుని కోడూరు మండల టైలర్స్ యూనియన్ సభ్యులు ప్రధాన రహదారుల వెంబడి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సాధారణ వస్త్రాన్ని కత్తిరించి, కలిపి కుట్టి ఓ రూపు తెచ్చేది దర్జీలని, ఆ దుస్తులు మనిషికి దర్జాను తీసుకువస్తాయన్నారు. కోడూరు మండల టైర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పడవల కృష్ణ, కోశాధికారి కూనపురెడ్డి వీర రాఘవయ్య, ఆముదాలపల్లి నాగమల్లేశ్వరరావు, నాగేశ్వరరావు, చెన్ను శ్రీనివాసరావు, కె.విజయ్‌కుమార్, పడమటి రాజ్యలక్ష్మి, గోలి మాధవి, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళలు స్వయం సమృద్ధిని సాధించాలి

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 28: డ్వాక్రా మహిళలు తాము తయారు చేసిన వస్తువులను మార్కెటింగ్ చేస్తూ ఆర్థికంగా ఎదగాలని మునిసిపల్ కమిషనర్ బాపిరాజు అన్నారు. బుధవారం మునిసిపల్ కార్యాలయం వెలుపల డ్వాక్రా మహిళలు తాము తయారు చేసిన రోల్డుగోల్డు నగలు, బ్యాగులు, వస్త్రాలు విక్రయించారు. అధికారులు బసవేశ్వరరావు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలకు వైసీపీ ప్రభుత్వ ప్రచారం

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 28: కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన పీఎం కిసాన్ సమ్మాన్ నిధి యోజన పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం తమ పథకంగా చెప్పుకుని ప్రచారం చేసుకోవడం ఆశ్చర్యంగా ఉందని బీజేపీ యువమోర్చా కృష్ణాజిల్లా అధ్యక్షుడు నాగలింగం అయోధ్య రామచంద్రరావు పేర్కొన్నారు. బుధవారం బీజేపీ కార్యాలయం వద్ద జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

• ఎంఈవో 2 వైవీ హరనాథ్

పెడన, ఫిబ్రవరి 28: మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక రంగాల్లో మార్పు అవసరమని ఎంఈవో 2 వై.వి.హరనాథ్ అన్నారు. సైన్సు దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక విశ్వభారతి హైస్కూల్‌లో ప్రిన్సిపాల్ అనుమకొండ గౌరీప్రసాద్ పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను హరనాథ్ ప్రారంభించారు. తొలుత సి.వి. రామన్ చిత్రపటానికి నివాళులర్పించారు. సైన్స్‌ఉపాధ్యాయులు రాంబాబు, నాజీయాబేగం, పార్వతి పాల్గొన్నారు.

మచిలీపట్నం టౌన్: స్థానిక సుకర్లాబాద నెల్లూరు రవీంద్ర భారతి స్కూల్‌లో బుధవారం నిర్వహించిన సైన్స్ ఎక్స్‌పో విద్యార్థులను ఆలోచింపజేసింది. 250 ప్రాజెక్టులను విద్యార్థులు ప్రదర్శించారు. డీన్ శ్రీకాంత్, ప్రిన్సిపాల్ సీతామహాలక్ష్మి, జోన్ ఇన్‌చార్జి శివారెడ్డి, ఏజీఎం కేశవరావు, కార్పొరేటర్ ముంతాజ్ పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

అవనిగడ్డ రూరల్: మండల పరిధిలోని పులిగడ్డ గురుకుల విద్యాలయంలో సైన్స్ డే వేడుకలు బుధవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. సివి.రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ ఎస్.టి.పి.కుమార్, వ్యాయామోపాధ్యాయులు వీరకుమార్‌తోపాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మోపిదేవి : జాతీయ సైన్స్ దినోత్సవం మోపిదేవిలోని ప్రజాశక్తి నగర్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు పార్వతీదేవి ఆధ్వర్యంలో విద్యార్థులకు సర్ సి.వి.రామన్, ఇతర జాతీయ నేతల వేషధారణలతో సైన్స్ ప్రదర్శన ఏర్పాటు చేశారు. సైన్స్ యొక్క ఆవశ్యకతను విద్యార్థులచే ప్రదర్శనపూర్వకంగా అవగాహన కల్పించారు.



ఎగ్జిబిట్లను పరిశీలిస్తున్న ఎంఈవో హరనాథ్

కూచిపూడి: జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా పెదపూడి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. సైన్స్ ఉపాధ్యాయిని గీత ఆధ్వర్యంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు పాగోలు రమేష్‌బాబు పాల్గొని పిల్లల సైన్స్ ప్రాజెక్టులను పరిశీలించి అభినందించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. సివి.రామన్ ఆవిష్కరణ, రామన్ ఎఫెక్ట్ గురించి, సైన్స్ ఆవశ్యకతను పిల్లలకు వక్తలు వివరించారు.

గుడివాడ: విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకతను బయటకు తీసేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతగానో దోహదపడతాయని విద్యాలయ డైరెక్టర్ బొప్పన విజయభాస్కర్ తెలిపారు. జాతీయ సైన్స్ డేను పురస్కరించుకుని బుధవారం స్థానిక విద్యాలయ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో తారకరామా వాకర్స్ క్లబ్ సమక్షంలో ఏర్పాటు చేసిన సైన్స్ ఎక్స్‌పోను ఆయన సందర్శించారు. క్లబ్ సభ్యులు దొరెడ్ల శ్యాంబాబు, మెరుగుమాల బ్రహ్మయ్య, చిన్నం గంగాధరరావు, ఘంటసాల రామకృష్ణ, బి.రాధాకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.



గుడ్లవల్లేరులో ఎగ్జిబిట్‌లను పరిశీలిస్తున్న జిల్లా సైన్స్ అధికారి జాకిర్ హుస్సేన్

గుడ్లవల్లేరు: భారత దేశం అతి చేరువలో విశ్వగురువు కాబోతోందని ప్రపంచ దేశాలు భారత్‌కు వలసలు రాబోతారని భీమవరం శ్రీవిష్ణు ఇంజనీరింగ్ కళాశాల ఫిజిక్స్ ప్రొఫెసర్ పి.ఎస్ బ్రహ్మానందం అన్నారు. బుధవారం స్థానిక ఎ.ఎ.ఎస్.ఎం అండ్ వి.వి.ఆర్.ఎస్.ఆర్ గుడ్లవల్లేరు ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో 37వ జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

పాములలంకకు వైసీపీ ప్రభుత్వం ద్రోహం

• పల్లెబాటలో వర్ల కుమార్ రాజా

తోట్లవల్లూరు, ఫిబ్రవరి 28: గత టీడీపీ ప్రభుత్వం పాములలంక వద్ద కృష్ణానదిపై బ్రిడ్జి నిర్మాణానికి రూ.30 కోట్లు మంజూరు చేసి వల్లభనేని కనస్ట్రక్షన్‌కు టెండర్ ఇచ్చి పనులు చేపడితే 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం రివర్స్ టెండర్‌తో పనులు ఆపేసి పాములలంక ప్రజలకు ద్రోహం చేసిందని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వర్ల కుమార్ రాజా విమర్శించారు. పాములలంకలో బుధవారం పల్లెబాట నిర్వహించారు. ఐదేళ్ల నుంచి నిధులు మంజూరయ్యాయని, బ్రిడ్జి పనులు చేపడతామని చెబుతూ సీఎం జగన్, ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ప్రజలను మోసం చేశారన్నారు. మాజీ సర్పంచ్ పాముల శ్రీనివాసరావు, నేతలు పాముల ప్రకాష్, పాముల కోటేశ్వరరావు పాల్గొన్నారు. వల్లూరుపాలెం, బొడ్డపాడు, చినపులిపాక, రొయ్యూరు గ్రామాల్లో పల్లెబాట నిర్వహించారు. బీసీ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి వీరంకి వెంకట గురుమూర్తి, మండల టీడీపీ అధ్యక్షుడు వీరపనేని శివరామ్‌ప్రసాద్, సర్పంచ్ మూడే శివశంకర్ ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు. రొయ్యూరు వైసీపీకి చెందిన ప్రముఖ న్యాయవాది సూరి పవన్‌కుమార్ ఆధ్వర్యంలో లుక్కా నాగార్జున, మోర్ల చంద్రశేఖర్ తదితరులు 50 మంది టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.



టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలతో వర్ల కుమార్ రాజా

ఘనంగా అగస్త్యేశ్వరస్వామి కల్యాణం

బంటుమిల్లి, ఫిబ్రవరి 28: పెదతుమ్మిడి గ్రామంలో వేంచేసి యున్న స్వయంభూ పార్వతీ సమేత ఆగస్త్యేశ్వరస్వామి అష్టమ వార్షికోత్సవం సందర్భంగా స్వామి కల్యాణం ఘనంగా జరిగింది. బుధవారం ఉదయం స్వామికి రుద్రాభిషేకం, నాత్యోపాసన, బలిహరణ వంటి పూజల అనంతరం ఆలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ మట్టా విజయలక్ష్మీ దంపతుల ఆధ్వర్యంలో స్వామి కల్యాణం నిర్వహించారు.

బుద్ధప్రసాద్‌కే టీడీపీ,జనసేన టిక్కెట్ ఇవ్వాలి

చల్లపల్లి, ఫిబ్రవరి 28 : నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే మండలి బుద్ధ ప్రసాద్‌కే టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థిగా అవనిగడ్డ అసెంబ్లీ టికెట్ ఇవ్వాలని దళిత గ్రాడ్యుయేట్ ఫోరం రాష్ట్ర నేత బుల్లా కిషోర్, టీడీపీ నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు దిరిశం వెంకట్రావు కోరారు. బుధవారం చల్లపల్లిలో బహుజన దళిత నేతలు విలేకరులతో మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాలు బాగు పడాలంటే నీతి, నిజాయితీ కలిగిన నిస్వార్థ ప్రజాసేవకుడు మండలి బుద్ధప్రసాద్‌కే టిక్కెట్ కేటాయించాలని చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు.

విద్యుత్ సబ్ స్టేషన్ ప్రారంభం

కోడూరు, ఫిబ్రవరి 28 : కోడూరు మండల పరిధిలోని రామకృష్ణాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన విద్యుత్ సబ్ స్టేషన్‌ను ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు మంగళవారం ప్రారంభించారు. ఈ సబ్ స్టేషన్ వల్ల హంసలదీవి, పాలకాయితిప్ప, రామకృష్ణాపురం గ్రామాలకు, ఆక్వా సాగుకు విద్యుత్ లో ఓల్టేజీ ఇబ్బంది లేకుండా ఉంటుందన్నారు. డీఈఈ నడకుదిటి సుబ్రహ్మణ్యేశ్వరరావు, స్థానిక ప్రజాప్రతినిధులు, వైసీపీ శ్రేణులు, ఆక్వా రైతులు పాల్గొన్నారు.